ప్రజాశక్తి
బుధవారం 12 ఏప్రిల్ 2023
5
విజయనగరం

పాత కలెక్టర్ సూర్యకుమారికి వీడ్కోలు, కొత్త కలెక్టర్ నాగలక్ష్మికి స్వాగతం పలుకుతూ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూలమొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎస్‌పి ఎం.దీపిక

చర్చకురాని సమస్యలెన్నో..

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు; వేదికపై డిప్యూటీ సిఎం, డిప్యూటీ స్పీకర్, రెండు జిల్లాల కలెక్టర్లు

సాదాసీదాగా జెడ్‌పి సమావేశం
ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలపై సుదీర్ఘ చర్చ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా పరిషత్ సమావేశం సాదాసీదాగా జరిగింది. చాలా వరకు ప్రజా సమస్యలు చర్చకు రాలేదు. వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరాపై మాత్రం చర్చ జరిగింది. ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలపై ప్రజాప్రతినిధులంతా పోటా పోటీగా మాట్లాడారు. గృహ నిర్మాణం, బిల్లుల తదితరాలపై చర్చ నడిచింది. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో డిప్యూటీ సిఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. వైద్యారోగ్య రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజలకు సత్వర సేవలందించాలని, వారిని అన్ని విధాలుగా సంరక్షించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తూ వారికి అన్ని విధాలుగా అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. సచివాలయాల సర్దుబాటు, విశాఖ - రాయ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి పనులు జరిగే గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రత్యేక సేవలు, సీజనల్ వ్యాధులు, మలేరియా వ్యాప్తి నివారణ, గహ నిర్మాణాలు, రేషన్ పంపిణీ, అంగన్ వాడీ సేవలు తదితర అంశాలు చర్చకు వచ్చాయి. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణ పనులు పడకేశాయి. వేసవి ముగిసే లోపు ఈ పనులు చేపట్టకపోతే మరో ఏడాది పాటు ఒక్క అడుగు కూడా ముందుకు వేసే పరిస్థితి లేదు. ముఖ్యంగా తోటపల్లి కాలువల పనులు అసంపూర్తిగా ఉండడం వల్ల లక్ష్యానికి అనుగుణంగా నీరు అందించలేకపోతోంది. వీటిపై ప్రజాప్రతిధులు కనీసం ప్రస్తావించలేదు. మరోవైపు జిల్లాలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలను ఆదుకుని తమ జీవనోపాధి దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలంటూ కార్మికులు ఇటీవల ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేశారు. పలు మార్లు నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. వీటిపై కనీసం చర్చించి తద్వారా ప్రభుత్వానికి కొన్ని సూచనలు, విజ్ఞప్తులు చేసేందుకు కూడా చొరవ తీసుకోలేదు. సోషల్ ఆడిట్‌లో భాగంగా ఉపాధి హామీలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇవేవీ కనీసం చర్చించలేదు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సమావేశంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు వేయించాలని, అవసరమైన చోట్ల విద్యుత్ మీటర్లు వేయించాలని చెప్పారు. ఫైలేరియాతో నడలేనివారిని వికలాంగులుగా గుర్తించి ఆర్థిక సాయం అందించాలని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. గుమ్మడిగూడ పంచాయతీలో గహ నిర్మాణ లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్లో కనిపించలేదని సంబంధిత జడ్‌పిటిసి సభ్యురాలు సభ దృష్టికి తీసుకురాగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని పార్వతీపురం కలెక్టర్‌ను కోరారు. బాడంగిలో ఇళ్ల స్థలాలకు సంబంధించి పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వటం లేదని జడ్‌పిటిసి సభ్యుడు చెప్పగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని బొబ్బిలి ఆర్డీవోకు జెడ్‌పి ఛైర్మన్ సూచించారు.

104, 108 వాహనాలకు ప్రత్యేక షెడ్లు

వివిధ మండలాలకు కేటాయించిన 104, 108 వాహనాలు నిలుపుదల చేసేందుకు ప్రత్యేక స్థలం లేకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎండలో, వానలో బయటే ఉండటంతో రంగులు వెలిసిపోతున్నాయని జడ్‌పిటిసి సభ్యురాలు సభ దష్టికి తీసుకురాగా జడ్పీ ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. వాటి కోసం ప్రత్యేకంగా షెడ్లు నిర్మించాలని, దీనికి సంబంధించి అంచనాలను త్వరితగతిన తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయనరం జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి మాట్లాడుతూ వైద్యపరమైన సేవల కోసం ఆర్.ఎంపీల వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు. శిక్షణ పొందిన వైద్యులనే సంప్రదించాలని సూచించారు. పార్వతీపురం కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గుర్తు చేశారు. అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నామని వివరించారు. సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పట్ట భద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, నెల్లిమర్ల, బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, జిల్లా పరిషత్ సిఇఒ అశోక్ కుమార్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు; అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, ఒమ్మి రమణ

మోడీ ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలపై
14 నుంచి ప్రచారోద్యమం
సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపు

ప్రజాశకి-విజయనగరం టౌన్

కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 14 నుండి 30వ తేదీ వరకు ప్రచార ఉద్యమం చేపడుతున్నట్లు సిపిఎం, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, ఒమ్మి రమణ తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవనంలోమంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. అన్నదమ్ముల వలె కలిసి ఉండాల్సిన ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు మోడీ అమిత్ షా నాయకత్వం వహిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ నిరంకుశంగా అణచివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలందరి ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులను, ప్రభుత్వ పరిశ్రమలను, ఓడ రేవులను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు ధారాదత్వం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు బ్యాంకుల్లో దాచుకున్న లక్షల కోట్ల సంపదను అదాని కుంభకోణం చేస్తే కనీసం చర్యలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఆయనను వెనకేసుకొస్తుందని, అక్రమాలకు అండగా నిలుస్తుందని విమర్శించారు. నిత్యవసర సరుకులు ధరలను ఎప్పటికప్పుడు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారని అన్నారు. గడిచిన ఎనిమిదేళ్ల కాలంలో నిరుద్యోగుల బతుకులు అగాధంలోకి నెట్టబడ్డాయని అన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు పోరాటాలు జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం చలించకుండా దున్నపోతు మాదిరి వ్యవహరిస్తుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న ఈ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు ఏప్రిల్ 14 నుండి 30 వరకు సిపిఎం, సిపిఐ ఉమ్మడి ప్రచార కార్యక్రమం చేపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి .అశోక్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, ఆర్ శంకర్రావు పాల్గొన్నారు.

రూ.42.90 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 14వ డివిజన్లో రూ.42.90 లక్షలతో చేపట్టిన నిర్మాణ పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభోత్సవాలు చేశారు. పులిగెడ్డ వారి వీధిలో రూ.9.95 లక్షలతో నిర్మించిన రహదారిని ప్రారంభించారు. ఆ తర్వాత 23 లక్షల రూపాయలతో చేపట్టిన డాగ్ షెడ్ రోడ్డును, కుమ్మర వీధిలో 9.95 లక్షల రూపాయలతో చేపట్టిన రహదారులను ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, డివిజన్ కార్పొరేటర్ ఎస్ వివి రాజేష్, జోనల్ ఇంచార్జ్ ముచ్చు శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, ముద్దాడ మధు,కాళ్ళ సూరిబాబు, జి.శ్రీనివాసరావు, ఇసరపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్, జెడ్‌పి చైర్మన్

ప్రజల హృదయాల్లో పూలే స్థానం సుస్థిరం
డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం

మహాత్మా జ్యోతిభా పూలే జాతికి చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిభా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కృషిచేసిన జ్యోతిరావు పూలే మహనీయుడని కొనియాడారు. బాలికా విద్యకు ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, బాలికలకోసం, వెనుకబడిన వర్గాల కోసం పాఠశాలలు స్థాపించారని చెప్పారు. పూలే దంపతులు జాతికి చేసిన సేవలను స్మరిస్తూ, సావిత్రిబాయి విగ్రహాన్ని కూడా ఇటీవలే ఏర్పాటు చేశామన్నారు. జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం తమ జీవితాలను అంకితం చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి వేపాడ చిరంజీవిరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యుటీ మేయర్ రేవతీదేవి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఓ ఎం.గణపతిరావు, జిల్లా బిసి సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, ముద్దాడ మధు, భీశెట్టి బాబ్జీ, రెడ్డి పావని, నడిపేన శ్రీనివాసరావు తదితరులతోపాటు బిసి సంక్షేమాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. టాటా కన్సల్టెన్సీ దేశవ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి సాధించిన బిసి హాస్టల్ విద్యార్థి కె.మణికంఠను ఈ సందర్భంగా సత్కరించారు. ఇతనికి వసతిగృహ సంక్షేమాధికారి బి.జానకిరావు సొంతంగా రూ.5వేల నగదు బహుమతిని అందజేశారు.

ఆశయాల సాధనే పూలేకు ఘనమైన నివాళి

విజయనగరం టౌన్ : జ్యోతిరావుపూలే ఆశయాల సాధనే ఆయనకు ఘనమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుబ్బ రామమ్మ , సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, ఒమ్మి రమణ అన్నారు. పూలే 196వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎల్‌బిజి భవనంలో పూలమాలవేసి నివాళులర్పించారు. అంటరానితనం రూపు మాపేందుకు, సమానత్వం కోసం, అణగారిన వర్గాలకు విద్య అందించడం కోసం పూలే కృషి చేశారని తెలిపారు. వీటి సాధనకు కృషి చేయడమే పూలేకు ఘనమైన నివాళి తెలిపారు. నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న అసమానతలు పెంచే విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఆయన స్ఫూర్తితో అసమానతలు లేని,పేదరికం లేని, దోపిడీ లేని సమాజం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు శంకర్రావు, వి.లక్ష్మి, అశోక్ పాల్గొన్నారు.

పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ఘనంగా ఝాన్సీలక్ష్మి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ ఎంపి డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. సత్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తన నివాసంలోను, కళాశాలలోను కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ్ రావు, కళాశాల సిబ్బంది, డిసిఎంఎస్ చైర్మన్ అవనాపు భావన, వైసిపి నాయకులు అవనాపు విక్రమ్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, పలువురు అభిమానులు, ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలను తెలిపారు. రక్తదాన శిబిరంలో ఆమె మాట్లాడుతూ ఆధునిక కాలంలో రక్తదానం సంజీవినితో సమానమని, రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అని పిలుపునిచ్చారు. డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మికి తెలియజేశారు. అనంతరం వినికిడి లోపం ఉన్న వారికి వినికిడి పరికరాలను, అవిటి వారికి చేయూత కర్రలు, హెచ్‌ఐవి బాధితులకు పౌష్టిక ఆహారం, 100 మంది పేదలకు బట్టలు పంపిణీ చేశారు. సీతం కళాశాల ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రేమ సమాజం, కోట జంక్షన్,వివిధ ఆలయాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయ బ్లడ్ బ్యాంక్ లో పలువురు యువకులు స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తామాష్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చని తెలిపారు. కార్యక్రమం లో విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి కుమార్, రాయల్ క్యాబ్స్ శరత్, తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపి ఝాన్సీలక్ష్మి

పేదల ఆకలి తీర్చిందుకే ఫుడ్ బ్యాంకులు

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగరంలో అన్నార్తుల ఆకలిని తీర్చే ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు కావడం అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములనాయుడు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఫుడ్ బ్యాంకును మంగళవారం ఆయన పరిశీలించారు. అన్నదాన కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనే స్వయంగా పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సలహాలు సూచనలతో నగరంలో ఐదు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు కావడం సంతోషదాయకమన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిరాటంకంగా అన్నదాన కార్యక్రమం జరుగుతోంన్నారు. ఇదే స్ఫూర్తితో మరికొన్ని చోట్ల ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు మాట్లాడుతూ నగరంలో ఏర్పాటైన ఐదు ఫుడ్ బ్యాంకులు ద్వారా రోజు 800 మంది వరకు పేదలకు ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫుడ్ బ్యాంక్ నిర్వాహకులు ఇప్పిలి శ్రీనివాసరావు, సింహాద్రి శంకర్రావు, నామాల సర్వేశ్వరరావు, వేముల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల నిరసన

విజయనగరం కోట : ఎపిఎస్ ఆర్టీసీ ఎమ్‌డి ఇచ్చిన సర్క్యులర్ ను విజయనగరం డిపో లో అమలు చేయాలని కోరుతూ ఎన్ఎంయు ఆధ్వర్యాన కార్మికులు మంగళవారం డిపో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు డిపో అధ్యక్షులు బి.రామారాబు, కార్యదర్శి కె.చంద్రమౌలి మాట్లాడారు. సర్క్యులర్‌లో మహిళలకు మూడు రోజులు ప్రత్యేక సెలవులు ఉంటే, ఒక్కరోజు మాత్రమే అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళలను మానసికంగా శారీరకంగా ఒత్తిడికి గురిచేస్తున్నారని మండిపడ్డారు.కార్మిక చట్టాలను , సర్క్యులర్ ను పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎం.కృష్ణ, డిపో చైర్మన్ పి.భాస్కర్ , కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలకు మెగాఫోన్ వితరణ

శృంగవరపుకోట : మండలంలోని తిమిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం నియోజకవర్గం టిడిపి యువనేత గొంప కృష్ణ పాఠశాల ఉపాధ్యాయులకు మంగళవారం మెగా ఫోన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయివరపు చంద్రశేఖర్, లెంక శ్రీను, జుత్తాడ రామసత్య, ఆడారి రమేష్, కోరుకొండ శ్రీనివాసరావు, మాదిబోయిన మంగరాజు, కిలపర్తి హరి, దండుపాటి ఎర్నాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి పట్టణానికి చెందిన జాబిలి కర్రీ పాయింట్ ఓనర్ దొడ్డి త్రినాథ్ మంగళవారం పుస్తకాలను బహూకరించారు. విద్యార్థులు, నిరుద్యోగుల పోటీ పరీక్షలకు ఉపయోగ పడే సుమారు రూ. 3,500 విలువగల పుస్తకాలను శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్‌కు అందించారు. ఈ సందర్భంగా పుస్తకాలు అందించిన దొడ్డి త్రినాథ్‌కు శాఖ గ్రంథాలయ అధికారి, గ్రంథాలయ పాఠకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇదేనా ప్రగతి దారి?

- ఛార్జిమెమోలు, సరెండర్లతో అధికారులు ఉక్కిరిబిక్కిరి
- సూర్యకుమారి రెండేళ్ల పాలన తీరు
- నేడు నూతన కలెక్టర్ నాగలక్ష్మి బాధ్యతల స్వీకరణ

బదిలీ కలెక్టర్ సూర్యకుమారి

కొత్త కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఇదేనా ప్రగతి దారి..అధికారుల సరెండర్లు, సిబ్బందికి ఛార్జి మెమోలు..ఇంతేనా అభివృద్ధి' అన్న విమర్శలు కలెక్టర్ సూర్యకుమారి పాలనపై వినిపిస్తున్నాయి. ప్రధానంగా రైతులు, కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించలేదన్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వాలు మారినప్పుడు ప్రజలు ఎంతగానో ఆశలు పెంచు కుంటారో.... కలెక్టర్ మార్పును కూడా జిల్లా వాసులు అంతగానే పరిగణిస్తారు. ఎందుకంటే మరెవరికీ లేనన్ని అధికారాలు ఆ స్థానానికి ఉన్నాయి. ఈలెక్కన బదిలీపై వెళ్లనున్న సూర్యకుమారి పరిపాలనను అధికారులు, జిల్లా ప్రజానీకం నెమరు వేసుకుంటు న్నారు. వచ్చిన కొత్తలో కలెక్టర్‌గా ఏదో సాధించాలనే తపన, ప్రగతి పథంలో నడిపించాలనే పట్టుదల ఉన్నట్టు కనిపించినప్పటికీ ఆ తరువాత అవన్నీ ఆచరణలో కనిపించలేదు. ముఖ్యంగా జిల్లాకు వచ్చిన నుంచి వెళ్లిన వరకు ఛార్జిమెమోలు... సరెండర్లు... అదిరింపులు... బెదిరింపులతో జిల్లా అధికారులు, సచివాలయ ఉద్యోగులు హడలెత్తిపోయారు. ఈనేపథ్యంలో ఆమె బదిలీతో చాలా మంది అధికారులు ఊపిరి పీల్చు కుంటున్నారు. బాధపడి పోతున్న అధికారులూ కొద్దిమంది లేకపోలేదు. ఆచరణలో ఆమె చేపట్టిన చర్యలేవీ పరిపాలన చక్కదిద్దడానికి ఉపయోగపడలేదు. కొంతమంది అధికారులు చీదరించుకునే పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా బాధ్యతలు స్వీకరించినప్పుడు పుష్పగుచ్ఛాలు, శాలువాలు, బహుమతులను నిరాకరించారు. వీడ్కోలు సభల్లో వాటినే అందుకుంటూ ఔరా..! అనిపించారు. ప్రక్షాళన పేరుతో పేషీలో పనిచేసి వారిని మార్పు చేశారు. చివరకు అదే పేషీతో సంబంధం లేకుండా చాలా ఫైళ్లు నడిచాయి. ఈ క్రమంలో కొంతమంది అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా అభివృద్ధిపై పెద్దగా దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలులో విఫల మయ్యారు. జిల్లా సమాఖ్య సహా పలు శాఖల్లో నిధులను ఇష్టారాజ్యంగా మళ్లించారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. కొత్తవలసలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి, మహిళలకు విరివిరిగా ఉపాధి అవకాశాలు కల్పిస్తా మన్న మాట గడపదాటలేదు. పాలన మొత్తంలో మునుపెన్నడూ లేనంతగా వందలాది ఎకరాల భూములు 22ఎ నుంచి తొలగింపునకు గురయ్యా యని, మరికొన్ని చోట్ల భూములు 22ఎ లో చేరాయనే చర్చ ముమ్మరంగా సాగుతోంది. పాలనలో జాయింట్ కలెక్టర్ కిశోర్ కుమార్ సహా పలువురు సరెండర్లకు గురయ్యారు. ఒకానొక దశలో రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ తిరగబడింది. దీంతో, ఒక సస్పెన్షన్ వెనక్కి తీసుకోక తప్పలేదు. మీడియా ముందుకు వచ్చి మాట్లాడేం దుకు సాహశించలేక పోయారు. దీంతో, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాల ప్రగతిపైనా తగినంత ప్రచారం జరగలేదు. చాలా మంది కలెక్టర్లు తమ ప్రత్యేకత చాటుకుంటూ కొన్ని పథకాలపై శ్రద్ధ కనబరచడం లేదా తామే ఏదో ఒక కొత్త పథకాన్ని రూపొందిం చడం వంటివి చేస్తుంటారు. ఈ లెక్కన గతంలో పనిచేసిన కలెక్టర్ మొక్కలు నాటడం, చెరువుల శుద్ధి, భూగర్భ జలాలు పెంపు వంటి కార్యక్రమాల్లో విజయవంత మయ్యారు. అంతకు ముందు పనిచేసిన వివేక్ యాదవ్ స్వచ్ఛభారత్ పేరిట మరుగుదొడ్ల నిర్మాణంలో సఫలీ కృతమయ్యారు. అదే పద్ధతిలో సూర్యకుమారి కూడా సఖి, సహేళి అనే పథకాలు ప్రవేశపెట్టి నప్పటికీ వాటిని జనాలకు పరిచయం కూడా చేయలేక పోయారు. జిల్లాకు వచ్చిన వెంటనే అక్షర్యాసత పెంచేందుకు కృషిచేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అటువంటి కార్యక్రమాలేవీ చేపట్టలేదు. ఉత్సవాల నిర్వహణకు నిధుల పేరిట వాహనాలను బహుమతులుగా ప్రకటించి ఏకంగా లాటరీ టిక్కెట్లు జారీ వరకూ రావడంతో జిల్లా ప్రజానీకం నివ్వెర బోయారు. ఈ విషయమై జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ కలెక్టర్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. ఇలా ఎన్నో వివాదాలు చర్చనీయాంశమయ్యాయి.

ప్రస్తుతం నూతన కలెక్టర్‌గా నాగలక్ష్మి వస్తున్న నేపథ్యంలో జిల్లా వాసులు, అధికారులు, ఉద్యోగులు గతాన్ని గుర్తు చేసుకుంటూ భవిష్యత్తును ఆలోచిస్తున్నారు. జిల్లాలో వనరులు పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా వ్యవసాయాధారిత జిల్లా కావడంతో ఇక్కడ సాగునీటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. చిన్నచిన్న ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ, ఉద్యాన పంటలకు మరింత ఊతమిచ్చేందుకు అవకాశం ఉంది. గిరిజన, మత్స్య కార ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకమైన కృషి చేయాల్సి ఉంది.

ఆర్ఎంపి అధ్యక్షులుగా సిర్లి రాజు

వంగర : గ్రామీణ (ఆర్.ఎం.పి) వైద్యుల సంక్షేమ సంఘం వంగర మండల అధ్యక్షునిగా సిర్లి రాజు (రాజారావు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జోషి, జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి ఆధ్వర్యంలో మండలంలోని మడ్డువలస ప్రాజెక్టు వద్ద ఆర్ఎంపి వైద్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఎముకల వైద్యులు సతీష్ ఎముకుల వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సిర్లి రాజు, కే సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా ఎస్ కనకలింగం, సహాయ కార్యదర్శిగా కే శ్రీనివాసరావు, కోసాధికారిగా ముత్యాలరావు, కమిటీ సభ్యులుగా ఎస్ వెంకటరమణ, కే రాము, బి వెంకటరమణ, డి తిరుపతి రావు, బి శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జీతాల కోసం మున్సిపల్ కార్మికుల ధర్నా

బొబ్బిలి : జీతాలు కోసం మున్సిపల్ కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఒకటి నాటికి వేతనాలు చెల్లించాల్సి ఉన్న చెల్లించకపోవడం అన్యాయమన్నారు. వేతనాలు ఇవ్వకపోవడంతో నిత్యావసర సరుకులు, మందులు కొనుగోలుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు నుంచి ఇఎస్ఐ సొమ్ము రికవరీ చేస్తున్న జమ చేయకపోవడంతో కార్మికులకు ఇఎస్ఐ వైద్యం అందడం లేదన్నారు. ఇఎస్ఐ సొమ్ము చెల్లించి వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు యుగంధర్, వెంకట్, గౌరీష్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను గిరిజనులకు ఇవ్వాలి

బాడంగి : మండలంలోని వీరసాగరంలోని సర్వే నంబర్ 186-5 ప్రభుత్వ భూమిని వీర సాగరం గ్రామ గిరిజనులకు ఇవ్వాలని సిపిఎం నాయకులు ఏ.సురేష్ డిమాండ్ చేశారు. ఆ గ్రామంలోని 12.62 ఎకరాల ప్రభుత్వ భూమిని పెత్తందారులు సాగు చేసుకుంటున్న విషయాన్ని తెలుసుకుని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను గిరిజనలకు కేటాయించాలన్నారు. ఈ విషయంపై ఎన్నిసార్లు స్థానిక తహశీల్దార్‌కు గిరిజనులు వినతినిచ్చినా స్పందించలేదన్నారు. గ్రామంలో ఉన్న 30 గిరిజన కుటుంబాలకు 186-5 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని స్థానిక తహశీల్దార్ చొరవ తీసుకొని గిరిజనలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని గిరిజనులకు పంచిపెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

ఆలుగుబిల్లిలో కుటుంబ ఆరోగ్య సర్వే

శృంగవరపు కోట: మండలంలోని ఆలుగుబిల్లి గ్రామంలో సిగ్మా రీసెర్చ్ కన్సజన్సీ ఏజన్సీ ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో భాగంగా గ్రామంలో మంగళవారం 300 ఇల్లు సర్వే చేశారు. ఈ సర్వేను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాపులేషను సంస్థ అయిదేళ్లకు ఒకసారి నిర్వహిస్తారని కొట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జి. లావణ్య తెలిపారు. ఈ సర్వే ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీమ్ సూపర్ వైజర్ ఎ. పార్థసారథి, సభ్యులు బి తేజేశ్వర నాథ్, కే.గోపి, ఆలుగుబిల్లి ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా గురమ్మ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య తీవ్రమైంది : మాజీ ఎమ్మెల్యే

శృంగవరపుకోట : వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రమైందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని శివాలయం వీధిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలు, విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు మోతలతో సామాన్య పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, విశాఖ టీడీపీ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాపుగంటి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కె.మల్లీశ్వరరావు, సాయిరాం, ఐటీడిపి రాష్ట్ర సెక్రెటరీ చెక్కా కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో జాగ్రత్తలు అవసరం

మెంటాడ : ఉపాధి పనిచేసే చోట జాగ్రత్తలు అవసరమని పంచాయతీ సెక్రటరీ రామ్‌నాథ్ అన్నారు. మండల కేంద్రంలోని అనంతసాగరంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 656 మంది ఇక్కడ పనులు చేస్తున్నారని వారికి సరపడా సౌకర్యాలను ఫీల్డ్ అసిస్టెంట్ సమకూర్చాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సువ్వాడ గౌరి నాయుడు, ఉపాధి మేట్‌లు, వేతనదారులు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు సూచనలు చేస్తున్న కార్యదర్శి

చలివేంద్రం ప్రారంభం

కొత్తవలస : వేసవి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఎంతో అవసరమని సి.ఐ. బాల సూర్యరావు తెలిపారు. స్థానిక సంత మార్కెట్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నందున అందరూ జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ ఏడాది వేసవి తట్టుకోవడానికి చల్లని మజ్జిగ, నీరు విరివిగా తీసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో మజ్జిగ, మంచినీరు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వేసవిలో ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు విన్నకోట రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

కొత్తవలస: విజయనగరం మాజీ ఎంపి బొత్స ఝాన్సీ లక్ష్మీ జన్మదినం సందర్భంగా వాగ్దేవి విద్యాసంస్థలు మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాయి. వాగ్దేవి విద్యా సంస్థ అధినేత కోటిని మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో 500 మంది అనాథ విద్యార్థులకు, వస్త్ర దానం, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఇ కుమార్ బాబు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అటెండర్ మృతి

వంగర: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న యాగాటి కాశయ్య (58) ఆయన స్వగ్రామం రేగిడి మండలం జావ్వాంలో అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈయన విఆర్ఏగా పనిచేసి 2018లో పదోన్నతపై అటెండర్‌గా విధుల్లో చేరారు. ఆయన మృతిపై తహశీల్దార్ డి ఐజాక్, డిటి బి.సుందరరావు, ఆర్ఐ జామి మురళి, రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. కాశయ్యకు భార్య రవణమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేరాలు ఘోరాలు

తప్పిన ప్రాణాపాయం

రేగిడి: మండలంలోని చిన్న శిర్లాం గ్రామానికి చెందిన కుప్పిలి ప్రసాద్ మంగళవారం బుడితిపేటకు వెళ్లే మార్గంలో ఉన్న చెరువులో దిగి ప్రాణాలు మీదుకు తెచ్చుకున్నాడు. స్నానానికి దిగిన వ్యక్తి మునిగిపోతుండటాన్ని గమనించిన స్థానికులు బయటకు తీసి 108 కు సమాచారం ఇచ్చారు. ఈఎన్ టి మీసాల ఈశ్వరరావు, పైలెట్ గర్బాపు నారాయణరావు సిపిఆర్‌తో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజాం కేర్ ఆస్పత్రిలో తరలించారు.

బెల్ట్ షాప్ పై దాడి

నెల్లిమర్ల : అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్ట్ షాపు పై దాడి చేసి 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి. నారాయణ రావు తెలిపారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ సతివాడలో బెల్ట్‌షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు

చెరువులో పడి వ్యక్తి మృతి

డెంకాడ : మండలంలోని బంటుపల్లి చెరువులో పడి వ్యక్తి అదే గ్రామానికి చెందిన రేయి అప్పలరాజు (40) మంగళవారం మృతి చెందాడు. గ్రామానికి దగ్గరిలో చెరువుకు స్నానం కోసం వెళ్లి అందులో దిగి స్నానం చేస్తుండగా ఈత రాకపోవడంతో మునిగిపోయి చనిపోయాడు. పశువుల కాపర్లు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగర 'పంచాయితీ'కి పదేళ్లు

- ఇప్పటికీ కానరాని అభివృద్ధి
- మరింత కుంటిపడిన ప్రగతి
- సొంత డబ్బులతో మురుగును తొలగించుకునే పరిస్థితిలో కౌన్సిలర్లు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సరిగ్గా పదేళ్ల క్రితం నెల్లిమర్ల మేజర్ పంచాయతీను నగర పంచాయతీగా అప్పటి ప్రభుత్వం మార్చింది. నెల్లిమర్లతో పాటు జరజాపుపేటను కూడా ఇందులో కలిపి నెల్లిమర్ల నగర పంచాయతీగా ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి నుంచి చాలా కాలం నగర పంచాయతీ వద్దూ.. పంచాయతీయే ముద్దు అని జరజాపుపేట గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు పోరాటం చేశారు. ఈ నేపథ్యంలో నగర పంచాయతీకి ఎన్నికలు లేకపోవడంతో అభివృద్ధి జరగడం లేదని కొన్ని ప్రధాన పార్టీలు ప్రచారం చేశాయి. దీంతో పోరాటం చేసిన వారు సైతం వెనుకడుగు వేశారు. ఫలితంగా ఎన్నికలు జరిగాయి. వైసిపికి చెందిన ప్యానల్ విజయం సాధించింది. చైర్‌పర్సన్‌గా బాధ్యతులు చేపట్టారు. అయినప్పటికీ నగర పంచాయతీ అభివృద్ధి జరగలేదు.

ఈ నాలుగేళ్లలో కుంటిపడిన ప్రగతి

వాస్తవానికి 2013లో నెల్లిమర్లను నగర పంచాయతీగా ప్రకటించారు. తరువాత ఎన్నికలు లేకపోవడంతో అధికారుల చేతిల్లోనే పాలన ఉండేది. 2019లో నగర పంచాయతీకి ఎన్నికలు జరిగిన తరువాత అధికార పార్టీకి చెందిన ప్యానల్ విజయం సాధించింది. బాధ్యతలు చేపట్టింది. కానీ నిధులు లేమి వల్ల అభివృద్ధి జాడ కానరాలేదు. సక్రమంగా నిధులు లేకపోవడంతో వ ం చా య ంతి కౌన్సిల్

ఇదీ మండల కేంద్రంలోని రోడ్డు పరిస్థితి

నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం

సమావేశాలు సైతం తూతూ మంత్రంగా నిర్వహించి వెళ్లిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కౌన్సిల్ సమావేశాల్లో అభివృద్ధి చేయాలని ఎన్ని పంచాయితీలు జరిగినా, అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు అభివృద్ధి పనుల పై ఏకరువు పెడుతున్నా ప్రభుత్వం, నాయకుల చెవికి ఎక్కడం లేదని పట్టించుకునే నాథుడే కరువయ్యారని కౌన్సిలర్లే బాహటంగా చెప్పుకుంటున్నారు. కాగా కోట్లాది రూపాయలు అభివృద్ధి పనుల కాగితాల్లో ప్రతి పాదనలకే పరిమితం కావడం కౌన్సిలర్లు జీర్ణించుకోలేక పోతున్నారు.

తాగునీరందదు.. మురుగు పారదు..

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. కనీసం ప్రజలకు సకాలంలో తాగునీటిని కూడా అందించలేని పరిస్థితిలో యంత్రాంగం పనిచేస్తోంది. కాలువుల్లో పూడికల తీయకపోవడం వల్ల మురుగు కూడా పారడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్, సి.సి కాలువలు, రహదార్ల సమస్యల ఉన్నప్పటికి నాయకులు, అధికార్లు సైతం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా వార్డుల కౌన్సిలర్లు సమావేశాల్లో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న అభివృద్ధి పనులకు కూడా నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు నెల్లిమర్ల నగర పంచాయతీ పనులంటేనే భయపడుతున్నారని తెలిస్తోంది.

అభివృద్ధి చేస్తున్నాం

గతంతో పోల్చితే నెల్లిమర్ల నగర పంచాయతీ కాస్త అభివృద్ధి చెందింది. ఇప్పటికే రూ.1.52కోట్లతో 21 అభివృద్ధి పనులు చేశాం. మరో రూ. 1.10కోట్లతో 24 అభివృద్ధి పనులు చేసేందకు ప్రతిపాదనలు పంపించాం. ఇంకో రూ. 1.20కోట్లతో 35 పనులు టెండర్ స్థాయిలో ఉన్నాయి.

పి. బాలాజీ ప్రసాద్, కమిషనర్ నెల్లిమర్ల నగర పంచాయతీ

వార్డుల్లో తిరగలేని పరిస్థితి

వార్డులను అభివృద్ధి చేయకపోవడం, ఏ సమస్య వచ్చినా పరిష్కరించలేని స్థితిలో కౌన్సిలర్లు ఉండటంతో వార్డుల్లో తిరగలేకపోతున్నామని వారే చెబుతున్నారు. కాగా ఇప్పుడు ' జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఏ ముఖంతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తామని కౌన్సిలర్లు మదనపడుతున్నట్లు తెలిస్తోంది. కొంత మంది కౌన్సిలర్లు మాత్రం ప్రజలు బాధలను చూడలేక తమ సొంత డబ్బుతో తాగునీరు అందించడం, కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు నగర పంచాయతీ అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని కౌన్సిలర్లు, నగర పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

సొంత డబ్బులతో అపారిశుధ్యం పనులు చేయిస్తున్న కౌన్సిలర్ మైపాడ ప్రసాద్

కలెక్టర్ సూర్యకుమారికి ఘన వీడ్కోలు

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లా కలెక్టర్‌గా ఎ. సూర్యకుమారి దాదాపు రెండేళ్ల పాటు జిల్లాకు అందించిన సేవలు ప్రశంసనీయమని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పరిపాలనలో తనదైన మార్కు వేసుకున్నారని కితాబిచ్చారు. జెడ్‌పి సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో భాగంగా కలెక్టర్ ఎ. సూర్యకుమారిని ప్రత్యేకంగా సత్కరించారు. ఎంపి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసి సభ్యులు, అధికారులు ఆమెను పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మాట్లాడుతూ రోడ్ల మరమ్మతుల విషయంలో, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటులో, కొఠియా గ్రామాల సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. పంచాయతీ రాజ్ కమిషనర్‌గా ఆమె పదోన్నతి పొందినందుకు సంతోషంగా ఉన్నప్ప టికీ.. జిల్లా నుంచి బదిలీపై వెళ్లిపోతున్నందుకు బాధగా కూడా ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. పార్వతీపురం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ కలెక్టర్ సూర్యకుమారి కార్యదీక్ష, ప్రత్యేక ప్రణాళికా కలిగిన వ్యక్తి అని కితాబిచ్చారు.

ఎవరి మనసైనా నొప్పించి ఉంటే క్షమించండి : కలెక్టర్

వీడ్కోలు సభ అనంతరం జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి తన అభిప్రాయాలు పంచుకున్నారు. జిల్లాలో పని చేసిన కాలం ఎప్పటికీ మరువలేనని, ఇక్కడ ప్రజలు, ప్రజా ప్రతినిధులు వారి సంపూర్ణ సహకారంతో తన మనసుకు దగ్గరయ్యారని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోతున్నటికీ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ పని చేసిన కాలంలో తెలిసో.. తెలియకో ఎవరి మనసైనా నొప్పించి ఉంటే క్షమించాలని కోరారు.


కలెక్టర్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ సిఎం, జిల్లా పరిషత్తు చైర్మన్

విజయనగరం జిల్లా తనకి పుట్టినిల్లు లాంటిదని దానిని తక్కువ చేసి ఎవరూ మాట్లాడొద్దని.. ఇక నుంచి వెనుకబడిన జిల్లా అని సంబోధించ వద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో

పంచాయితీ రాజ్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న కలెక్టర్ సూర్యకుమారికి, జిల్లా అధికారులు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ మంగళవారం సాయంత్రం స్థానికంగా ఒక ఫంక్షన్ హాలులో ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. జిల్లాకు కొత్త కలెక్టర్ గా నియమితులైన ఎస్.నాగలక్ష్మి కి ఇదే కార్యక్రమంలో ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి, జెసి కె. మయూర్ అశోక్, జిల్లా ఎస్‌పి దీపికా పాటిల్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టేది?

- రైతు, ఉపాధి, పారిశుధ్య కార్మికుల సమస్యలు గాలికి
- నేడు మండల సర్వసభ్య సమావేశం

జామి : ప్రజా సమస్యలు గాలికొదిలేశారు. ఏడాది ముందే ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ బిజీగా ఉండగా, అధిష్టానం ఆదేశాలతో అడపాదడపా కార్యక్రమాలు మినహా, స్థానిక సమస్యలపై ప్రతిపక్ష పార్టీలు కూడా మాట్లాడని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ప్రజా సమ్యలు పక్కదారి పట్టాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుధవారం జరగనున్న సాధారణ సర్వసభ్య సమావేశంలో కనీసం స్థానిక సమస్యల పైనైనా చర్చ జరుగుతోందా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. వాస్తవానికి వైసిపి అధికారం చేపట్టిన ఈ నాలుగేళ్లలో సంక్షేమ పథకాలు మినహా, ప్రజా సమస్యల పరిష్కారానికి అంతగా దృష్టి సారించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా గ్రామ పరిపాలనలో ఎంతో కీలక బాధ్యత పోషించే పారిశుధ్య కార్మికులు జీత భత్యాల విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వేచ్ఛ భారత్ మిషన్ ద్వారా నియమించిన గ్రీన్ అంబాసిడర్లుగా పంచాయితీ కార్మికులను మార్చేసి, వారికి ఆరేడు నెలలుగా జీతాలు ఇవ్వని దుస్థితి. మరోవైపు అకాల వర్షాలకు మామిడి పంట దెబ్బతిని రైతాంగం పూర్తిగా కుదేలైన పరిస్థితి. కనీసం పంటల భీమా కూడా వర్తించక రైతులు నష్టపోతున్నారు. చెరకు రైతు పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. ఉపాధి కూలీలు రెండు పూటల పనితో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎండల తీవ్రతతో అష్టకష్టాలు పడుతున్నారు. వేసవి అలవెన్సులు నిర్లక్ష్యంగా కోత విధించి, కూలీలను వేసవి ఎండలకు బలి చేస్తున్నారు. పోనీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయం సేవల్లో కూడా అవినీతి రాజ్యమేలుతుంది. మండల కేంద్రంలో గృహ నిర్మాణంలో బాహాటంగానే లబ్ధిదారుల నుంచి ఇంటికి రూ.11వేలకు పైగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అధికార పార్టీ ఒత్తిళ్లతో వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది సంక్షేమ పథకాలకు సంతకాలు పెట్టకుండా నానా ఇబ్బందులు పెడుతున్నారు. ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూ సర్వేల్లోనూ అధికార పార్టీ నాయకులు భారీ వసూళ్లకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ప్రజా పాలనలో అడుగడుగునా అవినీతి జరుగుతున్నా, పట్టించుకునే నాదులే కరువయ్యారు. హైవే నిర్మాణ సమస్యలు, సంక్షేమ పథకాల మంజూరు, భూ దందాలో అవకతవకలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

ప్రజాశక్తి- మెంటాడ

సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే వైసిపిని గెలిపిస్తాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మంగళవారం సాయింత్రం మెంటాడలో ' జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి జగనన్న పథకాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. పిట్టాడ, చింతలవలస, కైలాం, చల్లపేట, కొంపంగి, మీసాలపేట గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు పలు సమస్యలపై వినతులు అందజేసారు. గ్రామాలలో ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైసిపి నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, మండల సచివాలయ కన్వీనర్ కనమెరక త్రినాథ్, పతివాడ విశ్వేశ్వరరావు, త్రినాథరావు, సిరిశెట్టి నారాయణరావు, రెడ్డి రాజప్పలనాయుడు, బాయి అప్పారావు, చొక్కాపు సన్యాసి నాయుడు, పాంద్రంకి సన్యాసిరావు, పతివాడ గోవింద తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్ల కాలంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ఎమ్మెల్యే కడుబండి గ్రామ ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ఈ మూడేళ్ల కాలంలో అందిస్తున్న సంక్షేమ ఫలాలను నేరుగా వారికి వివరించి వారు పొందుతున్న లబ్ధిని గుర్తుచేశారు. మరోసారి తనకు, సిఎం జగన్మోహన్‌రెడ్డికి అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అల్లు బుజ్జి, అల్లు చిట్టిబాబు, వాకాడ రాంబాబు, జయశంకర్, గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, వైసిపి కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

ప్రజాశక్తి- బొబ్బిలి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శివ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని మంగళవారం పట్టణంలో వేర్వేరుగా నిర్వహించి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతికి పూలే పని చేశారని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు పని చేయాలని బేబినాయన కోరారు. రాజ్యాంగ హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తుందని, రాజ్యాంగ హక్కులు పరిరక్షణకు పని చేయాలని సిపిఎం నాయకులు శంకరరావు కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

వంగర: మండల కేంద్రంలో దళిత, బహుజన జెఏసి ఆధ్వర్యంలో పూలే 197వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ బి. సుందర రావు, మండల విద్యాశాఖ అధికారి వై. దుర్గారావు, దళిత, బహుజన జెఏసి నాయకులు మజ్జి గణపతిలు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

బొబ్బిలిరూరల్ : నారాయణప్ప వలస ప్రధానోపాధ్యాయులు, రోటరీ క్లబ్ కార్యదర్శి జె.సి.రాజు మంగళవారం స్థానిక పాఠశాలలో పూలే 196 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులరిర్పచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని వీర సాగరంలో మంగళవారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను సిపిఎం నాయకులు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కృష్ణ, లక్షణ, గంగులు పాల్గొన్నారు.

గరివిడి : చీపురుపల్లిలో మంగళవారం పూలే జయంతి సందర్భంగా పూలే విగ్రహం వద్ద టిడిపి నియోజకవర్గం ఇంచార్జి కిమిడి నాగార్జున నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల బలరాం, రౌతు కాము నాయుడు, వెన్నె సన్యాసి నాయుడు, తిరుమల రాజు కిరణ్ కుమార్ రాజు, దన్నాన రామ చంద్రుడు, పాల్గొన్నారు.

విజయనగరం కోట : కుల వ్యవస్థ నిర్మూలనకు విశేష కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్.బి. రామానాయుడు కొనియాడారు. గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు ముందుగా పాఠశాల సిబ్బంది విద్యార్థులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. జ్యోతిరావు పూలే వేషధారణలో విద్యార్థులకు రామానాయుడు పాఠం బోధించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు పాల్గొన్నారు.

కొత్తవలస: పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విజయనగరం: నారాయణ పబ్లిక్ స్కూల్లో పూలే వేషధారణలో రామానాయుడు

డిబిఎస్‌యు ఆధ్వర్యాన... దళిత బహుజన శ్రామిక యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్దగల జ్యోతిరావు పూలే విగ్రహానికిలా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు రాయి ఈశ్వరరావు, 'మిక్కీ' సంస్థ జిల్లా అధ్యక్షులు జొన్నాడ చిన్నారావు, కోరుకొండ వరలక్ష్మి, బి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ ఆధ్వర్యాన... కులవివక్షత, అంటరానితనంపై గురిపెట్టిన తూటా పూలే అని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ అన్నారు. స్థానిక బొగ్గులదిబ్బలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూర్యకళ, చినతల్లి ,లక్ష్మీ, చిన్న, వరలక్ష్మి, విశాలాక్షి, రామలక్ష్మి, పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ కార్యాలయం వద్ద.. ఎస్ఎఫ్ఐ కార్యాలయం వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సి.హెచ్ వెంకటేష్, డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి ఎన్ రుద్ర ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాము, సహాయ కార్యదర్శి హర్ష, జగదీశ్, రవి, వెంకటేష్, రామకృష్ణ, డివైఎఫ్ఐ అధ్యక్షులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గదుల వెంకటరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణం, బిసి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు రామేశ్వర్ రామారావు, కార్యదర్శి ఎస్ ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో మహాత్మా జ్యోతీరావ్ పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జెడ్‌పిటిసిలు నెక్కల శ్రీదేవి, గొర్లె సరయు, జెసిఎస్ మండల ఇంచార్జ్ బొంతుల వెంకటరావు, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి పాల్గొన్నారు.

పున: శంకుస్థాపన సిగ్గు చేటు

నెల్లిమర్ల: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పున్ణ శంకు స్థాపన చేయడం సిగ్గు చేటని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఎద్దేవా చేశారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మహాత్మా జ్యోతీ భాపూలే జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన విమానాశ్ర యానికి మళ్లీ శంకుస్థాపన చేయడం సిగ్గుచేటున్నారు. నిర్వాసితు లకు సరిగ్గా పరిహారం ఇవ్వకపోవడంతో మా భవిష్యత్తు ఏంటని నిర్వాసితులు గోడుపెడుతున్న పట్టించుకోకుండా జగనన్న మా భవిష్యత్ నువ్వే అని తలుపులకి స్టిక్కర్లు అతికించడం దారుణ మన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్ల మెంట్ స్పోక్స్ పర్సన్ లెంక అప్పల నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, పూసపాటిరేగ మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకర్రావు, నగర పంచాయతీ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, పట్టణ ప్రధాన కార్యదర్శి అవనాపు సత్య నారాయణ, నాయకులు దంగా భూలోక, నీలపు అప్పల రామిరెడ్డి, దాసరి అప్పలస్వామి, వెంపడాపు సూర్యనారాయణ, ఇజ్జిరోతు ఈశ్వరరావు, పసుపులేటి గోపి, అట్టాడ శ్రీధర్, కాళ్ల రాజశేఖర్, చందక ఆనంద్, సరగడ తోగులురెడ్డి, కింతాడ కళావతి, పాల్గొన్నారు.


నెల్లిమర్ల: పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు